క్లుప్తంగా

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- ఆర్డీఓ, ఈఆర్వో రామారావు
- ఎన్నికల కోడ్‌పై అవగాహన


ఎన్నికల సిబ్బంది సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఎన్నికల ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఓటు వేసే విధానంపై గ్రామీణులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అపోహలు తొలగించాలని వారికి సూచించారు. ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయాలని ఆర్డీఓ సిబ్బందికి ఆదేశించారు. ఎక్కడా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు ఉండడానికి వీలు లేదన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, ఎంపీడీఓ ఉషారాణి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాల్సిన బాధ్యత అధికారులదే

ఎంపీడీఓ ఉషారాణి


ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో పథక అమలు తీరుపై సమీక్షించారు. కూలీల శాతాన్ని పెంచి ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. మెట్ట ప్రాంతంలో కూలీలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. ఈ పథకం కింద చేపడుతున్న డ్రైన్లు, రహదారుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కూలీల దినసరి వేతనం, కూలీల మస్తరు, పనులు జరుగుతున్న తీరుపై ఎంపీడీఓ సమీక్షించారు. మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, ఏపీఓ రాజుబాబు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచడమే స్వీప్ లక్ష్యం

డ్వామా పీడీ వెంకటలక్ష్మి


స్వీప్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీడీ వెంకటలక్ష్మి

పెద్దాపురం: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదు లక్ష్యంగా ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) సదస్సులు నిర్వహిస్తున్నట్టు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని చిన బ్రహ్మదేవంలో గురువారం ఆమె ఉపాధి కూలీలకు ఓటరు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఓ రాజుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటున 79.77 శాతం పోలింగ్ నమోదు కాగా జాతీయ స్థాయిలో 69 శాతం పోలింగ్ నమోదైందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదు కావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు. ఓటు అనే వజ్రాయుధంతో ప్రతి పౌరుడు తమ ఓటు ద్వారా మంచి ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ఉన్నవారంతా ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంతి, గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

19 నుంచి వేంకటేశ్వర కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక మెహర్‌నగర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 31న వరకూ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 19న విష్వక్సేన పూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, 20న రాత్రి 7 గంటలకు దివ్య కల్యాణ మహోత్సవం, 21న భజన, 22న లక్ష తులసీపూజ, రాత్రి సదస్యం, అనంతరం ఘంటసాల సంగీత విభావరి, 23 భక్తి సంగీత విభావరి, 24న పూర్ణాహుతి, రాత్రి శ్రీపుష్పయాగం, 25న భక్తి సంకీర్తనగానం, 26న శివ పార్వతుల కల్యాణం బుర్రకథ, 27న సినీ భక్తి సంగీత విభావరి, 28న మెహర్‌సాయి ఆరాధన, 29న భక్తి సంగీత విభావరి, 30న కోల సంబరం, 31న అన్నదాన కార్యక్రమం జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు మల్లిపూడి వెంకటేష్, మల్లిపూడి ఛత్రపతి శివాజీ గణేష్ గురువారం విలేకర్లకు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మైకాసుర వధ విస్మరించి..

- పాలిథిన్ వినియోగంపై ఉత్తుత్తి చర్యలు
- ఉత్పత్తిని అరికట్టడంలో నిర్లక్ష్యం
- సత్ఫలితాలివ్వని పైపై ఆదేశాలు


ఏ నగరంలో చూసినా ఇటువంటి గుట్టలే.. (అంతర చిత్రం) పట్టణంలోని ఓ దుకాణంలో విక్రయానికి ఉంచిన ప్లాస్టిక్ వస్తువులు

పెద్దాపురం: గాయానికి కాకుండా మూలానికే మందు వేయాలన్నది ఆయుర్వేద సూత్రం. అలాగే కీలెరిగి వాత పెట్టాలన్నది నాటు వైద్యంలో చెప్తారు. మానవాళి ఆయువును అంతకంతకూ ముంచేస్తున్న మైకాసురుడిని తుదముట్టించాల్సిన విషయాన్ని విస్మరించి దానిని వినియోగిస్తున్నవారిపై కొరడా ఝుళిపించి ఏం లాభమని విజ్ఞుల ప్రశ్న.

మైకా (పాలిథిన్) కవర్ల వినియోగాన్ని నియంత్రించేందుకు అధికారుల ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా సత్ఫలితాలనివ్వడం లేదు. ప్రజల్లో స్వయంగా ఆ దుష్ప్రభావాలపై అవగాహన వస్తే తప్ప, భావితరాలు ఎంత పెద్ద సమస్యను ఎదుర్కొనబోతున్నారో ఆలోచించగలిగితే తప్ప పాలిథిన్ వినియోగాన్ని నియంత్రించలేని పరిస్థితి నెలకొంది.

రీసైక్లింగ్‌పై దృష్టిపెట్టాలి

తక్కువ మైక్రాన్ల సంచులను పక్కన పెడితే ఎక్కువ మైక్రాన్ల పాలిథిన్ సంచులను వినియోగించి పడేస్తుండడం వల్ల అవి భూమిలో కలిసేందుకు వందల ఏళ్లు పడుతుందని స్వయంగా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పర్యావరణవేత్తలు చెప్తున్నారు. కాబట్టి ఈ పాలిథిన్‌పై మరిన్ని పరిశోధనలు జరిగి పెట్రో ఉత్పత్తులుగా కానీ, పర్యావరణ హిత వస్తువుల తయారీకి కానీ వినియోగించగలిగితే తప్ప ఈ ప్లాస్టిక్ భూతాన్ని నియంత్రించలేమన్నది నిర్వివాదాంశం.

క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదం...

నేడు కాఫీ, టీ, కూరలు, సాంబార్, తాగునీరు తదితర ఆహార పదార్థాల సరఫరాకు సైతం గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో సైతం పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు. ఆ ఆహార పదార్థాలను భుజిస్తున్నవారు ఆ ప్లాస్టిక్ పరమాణువులను సైతం అనివార్యంగా లోనికి తీసుకుంటున్నారని తాజా పరిశోధనలు చెప్తున్నాయి. ఇవి క్యాన్సర్ కారకంగా మారుతున్నాయని శాస్త్రవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వీటిని కాల్చడం వల్ల కూడా విష వాయువులు ఊపిరి తిత్తులను పాడుచేస్తాయని వారంటున్నారు.

వినియోగంపై కాదు.. ఉత్పత్తిని అరికట్టాలి

అధికారుల్లో చిత్తశుద్ధి ఉండి.. ప్రజాప్రతినిధుల్లో నిబద్ధత ఉంటే వినియోగంపై కాదు మొట్టమొదటిగా ఉత్పత్తి కేంద్రాలపైనే దాడులు చేసి వ్యాపారులకు భారీగా జరిమానాలు, కఠిన శిక్షలు వేస్తే ప్లాస్టిక్‌ను స్వల్ప కాలంలోనే నియంత్రించవచ్చు. మార్కెట్‌లో పాలిథిన్ కవర్లను అందుబాటులో ఉంచి వినియోగించద్దు.. వినియోగిస్తే జరిమానా వేస్తామనడం ఎంత అనాలోచిత చర్యో అధికారులే ఆలోచించాలి.

ఆరోగ్య సమస్యలు వస్తాయి



పాలిథిన్ క్యారీ బ్యాగులు వినియోగించడం వల్ల వాటిలోని ప్రమాదకరమైన రసాయనాల వలన ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వీటి వినియోగంపైన ప్రజలు ఎవరికి వారే చైతన్యం కావాలి. – డాక్టర్ సూర్యకుమారి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, పెద్దాపురం

ప్రజల సహకారం అవసరం



ప్లాస్టిక్ సంచుల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో అవసరం. ప్లాస్టిక్ సంచుల బదులు నార లేదా, కాటన్ సంచులు వాడాలి. వ్యాపారులు, ప్రజలు సహకరించి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి. – కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

పురాతన ఆలయాల పరిరక్షణకు చర్యలు


పిఠాపురంలో ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ వంగా గీత

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- పిఠాపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

పిఠాపురం: సంస్కృతీ సంప్రదాయాలకు నిలయాలుగా మారిన పురాతన ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధులు రూ.1.10 కోట్లతో చేపట్టే పిఠాపురం నూకాలమ్మ గుడి వీధిలోని పురాతన సకలేశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలు, ఎంపీ గ్రాంట్ రూ.15 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో చేపట్టే రహదారుల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బొజ్జా దొరబాబు, బాలిపల్లి రాంబాబు, ముమ్మిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు


పిఠాపురం మండలం జల్లూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు


కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

పిఠాపురం: మీకు రక్షణగా మేము ఉంటాం, మీ ఓటుహక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛంగా వినియోగించుకోండి అంటూ పిఠాపురం నియోజకవర్గంలో పోలీసులు ప్రచారం చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో గురువారం కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు, ఓటుహక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో కేంద్ర సాయుధ సీఐఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. గ్రామాల కూడళ్లలో లౌడ్ స్పీకర్ల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

బొమ్మాండమైన రక్షణ


కొత్తపల్లిలోని పంట పొలాల్లో ఏర్పాటు చేసిన కొండముచ్చు బొమ్మ


పంట పొలాల్లో ఏర్పాటు చేసిన పులి బొమ్మ

- కోతుల నుంచి పంటల సంరక్షణకు రైతుల వినూత్న ఆలోచన
- పంట పొలాల్లో కొండముచ్చులు, పులుల ఫ్లెక్సీలు, బొమ్మల ఏర్పాటు


కొండముచ్చు బొమ్మను చూసి పొలాల్లోకి రాకుండా దూరంగా పోతున్న కోతులు

పిఠాపురం: నియోజకవర్గంలో రైతులకు కోతుల బెడద తప్పడం లేదు. ఎక్కడ చూసినా కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. అరణ్యంలో ఉండాల్సిన కోతులు ఊళ్ల బాట పట్టాయి. పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మనుషుల మీద దాడికి సైతం దిగుతున్నాయి. చేతికందాల్సిన పంటలను తమ కళ్ల ముందే పాడు చేస్తుంటే చేసేదేమీ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక రైతు తన పొలంలో కొండముచ్చు, పులి బొమ్మల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలు, బొమ్మలను చూసి కోతులు పొలాల్లోకి రావడానికి భయపడుతున్నాయి. ఇది గమనించిన మిగిలిన రైతులు తమ పొలాల్లో ఈ తరహా బొమ్మలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పుడు పొలాల్లో ఎక్కడ చూసినా కొండముచ్చు, పులుల బొమ్మలు దర్శనమిస్తున్నాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న శంకర్ మల్లిక్

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం తుని నియోజకవర్గానికి చెందిన 47 మంది బాధిత కుటుంబాలకు రూ.49.50 లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


సీతారామస్వామి ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

బోట్‌క్లబ్: నగరంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో గురువారం పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఆలయం గాలిగోపురం, పెయింట్, భక్తులు నడిచేందుకు గ్రానైట్ వేసేందుకు రూ.70 లక్షల దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలుత సీతారామస్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పుసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీ దేశంలోనే రికార్డు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి
- లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేత


అచ్చంపేట లబ్ధిదారులకు పట్టాలు అందజేసిన దొరబాబు, తహసీల్దార్ తదితరులు

సామర్లకోట: దేశ చరిత్రలో పేద ప్రజలకు 31 లక్షల ఇళ్ల పట్టాలు ఒకేసారి అందజేయడం ఒక రికార్డు అయితే ఆ పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసి అందజేయడం ఇదే ప్రథమమని నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం అచ్చంపేట, నవర, గొంచాల, పి. వేమవరం, ఉండూరు, పవర, పండ్రవాడ గ్రామాల్లో వారు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. తన పాదయాత్రలో 25 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి 31 లక్షలకు మించి ఇళ్ల పట్టాలు అందజేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఆయన మళ్లీ సీఎం అయితే మరింత మేలు జరుగుతుందని వారు తెలిపారు.

చంద్రబాబు నాయుడు ఓటమి భయంతో జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నారని చెప్పారు. ఓటర్లు ఇప్పటికే ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకున్నారని తెలిపారు. స్థానికుడైన తనకు సీఎం జగన్ వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారని ప్రజలు తనను ఆశీర్వదించాలన్నారు. ఓటర్లు ఎంపీ చలమలశెట్టి సునీల్‌కు ఒకటి, ఎమ్మెల్యేగా తనకు ఒకటి ఫ్యాను గుర్తుపై ఓట్ల బటన్లు నొక్కాలన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆర్.శ్రీనివాసు, నియోజకవర్గ పరిశీలకుడు చీకట్ల కిశోర్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, ఎలిశెట్టి నరేష్, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా పరిషత్తు విభాగ అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు తదితరులతో పాటు 28వ వార్డు కౌన్సిలర్ రెడ్నం సునీత పట్టాలను పంపిణీ చేశారు.

స్థానికుడిని గెలిపించండి

- నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి
- సత్యనారాయణపురంలో ఎన్నికల ప్రచారం


సామర్లకోట సత్యనారాయణపురంలో విజయ సంకల్పయాత్ర నిర్వహించిన దొరబాబు

సామర్లకోట: నియోజకవర్గంలో ప్రజలు స్థానిక అభ్యర్థిని కోరుకొంటున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక సత్యనారాయణపురంలో తన విజయసంకల్ప యాత్రతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామాలయంలో పూజలు చేశారు. సుమారు 40 ఏళ్ల తరువాత స్థానిక అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశం సీఎం జగన్ తనకు ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నం నేటికి ఫలించిందన్నారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని విజయసంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. స్థానికేతరులకు నియోజకవర్గ సమస్యలపై అవగాహన లేక పోవడం వల్ల నియోజవర్గం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. సీఎం జగన్ అమలు చేసిన నవరత్న పథకాలే తమ విజయానికి పునాది అని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకుడు చీకట్ల కిశోర్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పెద్దాపురం ఎంపీపీ పెంకే సత్యవతి, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మను నెక్కంటి సాయిప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, సొసైటీ అధ్యక్షులు మేకా శ్రీను, వీరంరెడ్డి నాని కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

17న పెద్దాపురంలో..

సామర్లకోట: వైఎస్సార్‌సీపీ పెద్దాపురం నియోజకవర్గం అభ్యర్థి దవులూరి దొరబాబు తన విజయ సంకల్పయాత్ర ఎన్నికల ప్రచారం ఈ నెల 17న పెద్దాపురంలో జరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డులో ప్రచారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

సురక్షిత ప్రయాణాలతో ప్రమాదాల నివారణ

- పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లతా కుమారి

తుని రూరల్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సురక్షితంగా ప్రయాణిద్దామని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి అన్నారు. మండలంలోని తేటగుంట జంక్షన్‌లో ఎస్సై డి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం రోడ్డు ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తరుచూ ప్రమాదాలు సంభవించడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. నిద్రలేమి, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారణకు తుని రూరల్ పోలీసులు చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. ప్రమాదాలు జరుగుతున్న జంక్షన్లలో ఏర్పాటు చేసేందుకు సమకూర్చిన స్టాపర్లు, పీపాలు, టైర్లను ఆమె ప్రారంభించారు. ప్రమాదాల నివారణకు ఏడు జంక్షన్లలో స్టాపర్లు, మరో మూడు చోట్ల సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని రూరల్ సీఐ మూర్తి తెలిపారు. ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, సర్పంచ్ అత్తి నాగరాజు, ఉప సర్పంచ్ పోతుల పెదకాపు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ, కోటనందూరు ఎస్సై శంకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాజబాబురాజు, గణేసుల వీరబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ గురువారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా చేబ్రోలులో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పాదయాత్రకు ఘన స్వాగతం

ప్రత్తిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన వై నాట్ 175కి మద్దతుగా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ చేపట్టిన పాదయాత్ర బృందానికి ప్రత్తిపాడులో ఘన స్వాగతం లభించింది. మంగళగిరికి చెందిన ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కత్తెపోగు బసవరావు నాయకత్వంతో శ్రీను, ధర్మ, రాకేష్, డేవిడ్ గత నవంబర్ 15న ఇడుపులపాయ నుంచి పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర గురువారం ప్రత్తిపాడు చేరుకుంది. గ్రామంలో పాదయాత్రకు లయన్స్ క్లబ్ ప్రతినిధి గుడాల వెంకటరత్నం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, వాసా చిట్టిబాబు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కత్తెపోగు బసవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నెలాఖరున ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగుస్తుందని చెప్పారు.

గిరి ప్రదక్షిణకు బస్సు సర్వీసు

తుని: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఈ నెల 23న ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్టు స్థానిక డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా 26న అరుణాచలం చేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణించేందుకు టికెట్ రూ.3500లుగా నిర్ణయించామన్నారు. టికెట్లు బుకింగ్ కోసం 73829 13216, 73829 21904 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రుణాలు వినియోగించుకోండి

అన్నవరం: యూనియన్ బ్యాంక్ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సాయి మనోహర్ సూచించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద గురువారం తుని నుంచి జగ్గంపేట వరకూ యూనియన్ బ్యాంక్ శాఖల ఆధ్వర్యాన మెగా క్రెడిట్ ఔట్ రీచ్ పోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక బృందాలు, పెన్షనర్లు, మీడియం, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ స్థాపనకు గాను లబ్దిదారులకు సుమారు రూ.4 కోట్ల రుణాలు అందజేశారు.

విద్యార్థులకు కెనరాబ్యాంక్ స్కాలర్‌షిప్


విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న కెనరాబ్యాంక్ చీఫ్ మేనేజర్ మల్లేశ్వరరావు

కరప: పేదవర్గాల బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కెనరాబ్యాంక్ విద్యాజ్యోతి పథకం ద్వారా ఆర్థికసాయం అందిస్తోందని ఆ బ్యాంక్ కాకినాడ దేవాలయం వీధి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వి.మల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముగ్గురు విద్యార్థినులకు విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌లను అందజేసి ఆయన మాట్లాడారు. విద్యార్థినులు జిల్లెల నిఖిత (10వ తరగతి)కు రూ.10 వేలు, దడాల అపరంజి (9వ తరగతి)కి రూ.5 వేలు, వజ్రపు శ్రీగాయత్రి (7వ తరగతి)కి రూ.2,500 వంతున చెక్‌లను మల్లేశ్వరరావు అందజేశారు. బ్యాంక్ అధికారి జి.బాలాజీ, ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.స్వర్ణరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.